ప్రజాశక్తి
శనివారం 28 సెప్టెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

29న ఏచూరి సంస్మరణ సభ

గుమ్మలక్ష్మీపురం : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ ఈనెల 29న పార్వతీపురం జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్టు జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏచూరి అకాల మరణం అత్యంత బాధాకరమన్నారు. విద్యార్థి దశ నుంచి చనిపోయే వరకు బడుగు, బలహీన వర్గాల పక్షాన అండగా నిలబడి ఎనలేని పోరాటాలు చేశారని అన్నారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్రమంత్రి సంధ్యారాణి, స్థానిక ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. కావున సభకు ప్రజలుపెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోలక అవినాష్, కొల్లి గంగునాయుడు, ఎం.రమణ, ఎం..శ్రీనివాసరావు, ఎం.సన్యాసిరావు, పి.మోహన్ రావు తదితరులు ఉన్నారు.

పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ : కలెక్టర్

- అడలి వ్యూ పాయింట్ ప్రారంభం
- ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో అడలి వ్యూ పాయింట్‌ను శుక్రవారం కలెక్టర్‌తో కలిసి స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.4 కోట్లతో ట్రైబల్ మ్యూజియం, రూ.27 కోట్లతో జగతిపల్లి రిసార్ట్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసేందుకు మరెన్నో పర్యాటక ప్రదేశాలను గుర్తిస్తున్నట్టు తెలిపారు. పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తూ స్థానిక గిరిజన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షించాలని పునరుద్ఘాటించారు. అడలిలో ఉండడానికి ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని అన్నారు. ప్రకృతిని ఆస్వాదించుటకు అడాలి వద్ద ట్రెక్కింగ్, టెలిస్కోప్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వచ్చే ఏడాది ప్రపంచ పర్యాటక దినోత్సవం నాటికి బెనరాయ్ వాటర్ ఫాల్స్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. రూ.1.50 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన మేరకు ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ వద్ద అన్ని టెర్రైన్ వాహనాలను అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే జయకృష్ణ మాట్లాడుతూ సీతంపేట, భామిని ప్రాంతాల్లో అనేక సుందరమైన ప్రదేశాలు, జలపాతాలు ఉన్నాయని, స్థానిక గిరిజన యువతకు జీవనోపాధి కల్పించేలా అభివృద్ధి చేయాలని కోరారు.

వ్యూ పాయింట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే జయకృష్ణ, ఎస్‌పి, ఐటిడిఎ పిఒ

ఎస్‌పి ఎస్వీ మాధవ రెడ్డి మాట్లాడుతూ వ్యూ పాయింట్ చాలా అందంగా ఉందని, రాబోయే రోజుల్లో ఇది ప్రసిద్ధ గమ్యస్థానాలలో ఒకటిగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.యస్వంత్ కుమార్‌రెడ్డి, ఎపిఒ జి.చినబాబు, టూరిజం అధికారి ఎన్.నారాయణరావు, గిరిజన సంక్షేమ ఇఇ ఎస్.సింహాచలం, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డిఇఒ జి.పగడాలమ్మ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎం.అన్నా దొర, ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణి, అడాలి వ్యూ పాయింట్ ప్రతినిధి విజయ్, స్థానికులు ఎస్ ముఖలింగం తదితరులు పాల్గొన్నారు.

వ్యూ పాయింట్ ప్రత్యేకతలు

అడలి వ్యూ పాయింట్ రాష్ట్రంలోని అత్యుత్తమ పర్యాటక ప్రదేశాలలో ఒకటి. జిల్లా యంత్రాంగం మంచి పర్యాటక ప్రాంతంగా గుర్తించి కొన్ని సౌకర్యాలు కల్పించాలని ఆలోచించింది. సీతంపేట ఐటిడిఎ రూ.1.56 కోట్లతో అడలి వ్యూ పాయింట్, కిచెన్ కమ్ బ్రేక్‌ఫాస్ట్ ఏరియా, టాయిలెట్ బ్లాక్ నిర్మాణాలు, రైలింగ్, పాత్ వే, నైట్ క్యాంపింగ్ ఏరియాకు లాన్ గ్రాస్ ఫ్లోరింగ్, ల్యాండ్‌స్కేపింగ్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు వచ్చింది. కార్పెట్ గ్రాస్, ప్లాంట్‌లతో, వ్యూ పాయింట్‌కి బిటి రోడ్డు ఏర్పాటు చేసింది. ఈ విధంగా అడాలి వ్యూ పాయింట్ అభివృద్ధి చేయడం జరిగింది. పర్యాటకులు ఆడాలి కొండపై ఉన్న సుందరమైన మనోహర దశ్యాలు పర్యాటకులకు ఖచ్చితంగా ఆకర్షిస్తాయనడంలో సందేహం లేదు. హిరమండలం రిజర్వాయర్, దాని పరిసరాలు ఈ ప్రదేశానికి ప్రధాన ఆకర్షణలు.

ఘనంగా పర్యాటక దినోత్సవం

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక సాంప్రదాయ ఆహారాలు, గిరిజన వాయిద్యాలు, పర్యాటక ప్రదేశాల ఫోటోలు తదితర ప్రదర్శనలతో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌లో సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మెట్టుగూడ జలపాతం సందర్శించిన కలెక్టర్

అనంతరం కలెక్టర్ మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. ఈ ప్రాంతం పర్యాటకంగా మంచి ప్రదేశమన్నారు. మంచి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పర్యాటక ప్రాంతాలు అందిస్తాయని కలెక్టర్ చెప్పారు.

అందుబాటులోకి పారా మోటార్

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో పర్యాటక దినోత్సవ సందర్భంగా ఘనంగా పర్యాటక ఫెస్టివల్ నిర్వహించారు. దీనిలో భాగంగా కలెక్టర్ గగన విహారయాత్ర ప్రారంభించారు. అలాగే 5డి థియేటర్ ప్రారంభించి వీక్షించారు. గగన విహారయాత్రలో ప్రయాణించారు, అనంతరం సంస్కత కార్యక్రమాలు విద్యార్థులు నిర్వహించారు. జబర్దస్త్ బృందం ఝాన్సీ, శాంతి స్వరూప్ ప్రదర్శించిన కార్యక్రమాలు పర్యాటకులను అలరించాయి.

నృత్యం చేస్తున్న గిరిజనులు

5డి థియేటర్‌లో తిలకిస్తున్న కలెక్టర్, ఐటిడిఎ పిఒ

గగన విహార యంత్రంలో పయనిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్ వద్ద బైఠాయించిన విఒఎలు

విధుల్లోకి తీసుకోవాలంటూ
కలెక్టరేట్ వద్ద విఒఎల బైఠాయింపు

ప్రజాశక్తి - పార్వతీపురం

అక్రమంగా తొలగించిన జియ్యమ్మవలస, కొమరాడ మండలాల విఒఎలను వెంటనే విధుల్లో చేర్చుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన నాయకులు బాధిత విఒఎలు కలెక్టరేట్ వద్ద శుక్రవారం బైఠాయించారు. విఒఎలపై వేధింపులు ఆపాలని, 6 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ మాట్లాడుతూ విఒఎలకు మార్చి నుంచి బకాయి వున్న వేతనాలు చెల్లించాలని కోరారు. ఇప్పటివరకు వేతనాలకు సంబంధించి అనేక పర్యాయాలు వినతి పత్రాలు అందించినా పలితం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని జియ్యమ్మవలస, కొమరాడ మండలం దలాయిపేటతో పాటు జిల్లా వ్యాప్తంగా విఒఎలను మానసికంగా వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విఒఎల అక్రమ తొలగింపులకు, వేధింపులకు గురవుతున్నారని చెప్పారు. మరి కొంతమందిని తొలగించడానికి జాబితాలు తయారు చేసి ఉద్యోగం నుంచి తొలగిపోవాలని వేధిస్తున్నారని చెప్పారు. స్థానిక రాజకీయ నాయకులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా విఒఎల అక్రమ తొలగింపులకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, శ్రామిక మహిళ సంఘం నాయకులు బి ఇందిరా మాట్లాడుతూ గ్రామ సమాఖ్య జనరల్ బాడీ సమావేశం నిర్వహించకుండా, అజెండా తీర్మానం లేకుండానే కొత్త మినిట్స్ బుక్స్‌లో మండల అధికారులే తీర్మానం రాసి గ్రామ సంఘం లీడర్లను మండల సమాఖ్యకు పిలిచి విషయం చెప్పకుండా సంతకాలు చేయించి పాతవారిని తొలగించారని చెప్పారు. కొత్తవారని నియమించి వారితో పనిచేయిస్తున్నారని, తొలగింపులకు గురైనటు వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ విషయమై పరిశీలించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ధర్నా వద్దకు వెలుగు పీడీ సత్యంనాయుడు వచ్చి విఒఎలు ఎవరిని తొలగించమని, తొలగించిన వారిని విధుల్లోకి చేర్చుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, విఒఎలు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమశాఖ డిడి సరెండర్

పనితీరు బాగోలేదంటూ కలెక్టర్ ఉత్తర్వులు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాంగదయ్యను సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ డిడిని సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిడి పనితీరు బాగోలేదంటూ కలెక్టర్ సరెండర్ చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను సరిగ్గా తనిఖీలు చేయడం లేదని, సిఆర్టీల క్రమబద్ధీకరణలో డబ్బులు వసూలు చేసినట్లు గతంలో ఆరోపణలు రావడం వంటి కారణాలతో సరెండర్ చేసినట్లు తెలుస్తోంది. డిడిగా రుక్మాంగదయ్య ఇక్కడికి వచ్చి ఏడు నెలలు కావస్తోంది.

రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

డిడి రుక్మాంగదయ్య సరెండర్ వెనుక రాజకీయ ఒత్తిళ్ల వున్నాయేమోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారపార్టీ నాయకులకు అనుకూలమైన అధికారిని తీసుకురావాలనే వ్యూహంలో భాగంగానే ఆయన్ను సరెండర్ చేసినట్లు సమాచారం.

గర్భిణులకు పౌష్టికాహారం అందాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన గర్భిణీలకు పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతులుగా ఉంచేలా చూడాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ సంబంధిత సిబ్బందికి సూచించారు. స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్, గర్భిణీల వసతి గృహాన్నిశుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు అందుతున్న సౌకర్యాలు, సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్ల పరిశీలించారు. గర్భిణీల ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సుఖప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైటిసిలో జరుగుతున్న అభివృద్ధి పనులను సంబంధిత భద్రగిరి ఐటిడిఎ ఇంజనీరింగ్ ఎఇ అప్పారావును అడిగి తెలుసుకున్నారు.

ఏజెన్సీలో పిఒ సుడిగాలి పర్యటన

కురుపాం : పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలలో శుక్రవారం ఏజెన్సీలో సుడిగాలి పర్యటన చేశారు. కురుపాంలో నిర్మాణంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను పరిశీలించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేసి, నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేయాలని అధికారులను ఆదేశించారు.

వైటిసిని సందర్శించిన ఐటిడిఎ పిఒ

కురుపాం ఏకలవ్య పాఠశాలను పరిశీలిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలి

ఆదివాసీ మాతృ బహుభాషా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రాథమిక స్థాయిలో అక్షరాస్యత నైపుణ్యాల అభివృద్ధికి, పాఠశాల విద్యా వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్న ఆదివాసీ మాతృబహు భాష ఉపాధ్యాయులకు బకాయి వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు పెంచాలని ఎపి ఆదివాసీ మాతృబహు భాష ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పాంగి శ్రీను, సవర డొంబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జులై నెల నుంచి విధులు నిర్వహిస్తున్న తమకు మూడు నెలలుగా గౌరవ వేతనాలు ఇంకా చెల్లించలేదన్నారు. ఇచ్చే వేతనం చాలా తక్కువ అయినప్పటికీ 3 నెలలైనా వేతనాలు చెల్లించకపోవడం చాలా బాధాకరన్నారు. కావున బకాయి వేతనం తక్షణమే విడుదల చేయాలని, అన్ని ఐటిడిఎ పిఒలకు, విద్యాశాఖ అధికారులకు వినతులను అందజేశామన్నారు. రాష్ట్రంలో 1327 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వీరంతా గత ఐదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితిలో జీవనం గడుపుతూ విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఉన్నత చదువులు చదివి బోధించడం వల్ల ప్రాథమిక విద్యలో గిరిజన భాషలకు విద్యార్థుల అభ్యసించే భాషకు వంతెనలా ఉపయోగపడుతున్నామన్నాని తెలిపారు. దీంతో ప్రాథమిక విద్యలో నాణ్యత, నైపుణ్యత పెరిగిందన్నారు. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల్లేరని, అయినా ఆ పాఠశాలలు కూడా ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయులతోనే నడుపుతున్నారని, దీంతో గ్రామీణ ప్రాంతంలో విద్యార్థుల డ్రాప్ శాతం కూడా తగ్గిందని తెలిపారు. ఇంత విశిష్టమైన సేవలందిస్తున్న తమకు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించేలా ఐటిడిఎ అధికారులు చొరవ చూపాలని కోరారు. అలాగే కనీసం జీతాలు పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్‌గా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా విహెచ్.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన ఇన్‌ఛార్జి కమిషనర్ రాఘవాచార్యులు నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మున్సిపల్ ఉద్యోగులు కమిషనర్ సత్యనారాయణను అభినందించారు.

హడ్డుబంగి ఆశ్రమ పాఠశాల సందర్శన

సీతంపేట : మండలంలోని హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలను డిఇఒ జి.పగడాలమ్మ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల ఆవరణలో చేపడుతున్న మాతోట మాబడి కార్యక్రమం నిర్వహణ బాగుందన్నారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ఈ ఏడాది టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. డిఇఒ వెంట ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ రీసెర్చ్‌లో దివ్యదర్శినికి 91వ ర్యాంకు

కురుపాం : శుక్రవారం విడుదలైన ఆలిండియా అగ్రికల్చర్ రీసెర్చ్ కౌన్సిల్ పరీక్షల్లో కురుపాంకు చెందిన దొనక దివ్య దర్శని 91వ ర్యాంకు సాధించింది. ఈమె బాపట్లలో ప్రభుత్వ కళాశాలలో బిఎస్‌సి అగ్రికల్చర్ పూర్తి చేసి అగ్రికల్చర్ రీసెర్చ్ పరీక్షల్లో సిద్ధమై 91వ ర్యాంక్ సాధించింది. ఈ ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు, బంధువులు అభినందనలు తెలిపారు. ఆమె తండ్రి దొనక కిషోర్ ఉద్యోగరీత్యా నెల్లిమర్లలో ప్రస్తుతం నివాసం ఉంటున్నారు

పాలకుల నిర్లక్ష్యంతోనే తాగునీటి కష్టాలు

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ
మూడో రోజుతో ముగిసిన రిలే దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం

పాలకులకు మద్యంపై ఉన్న మత్తు మంచినీటి సమస్యపై లేదని, ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ప్రజలకు నీటి కష్టాలు ఎదురవుతున్నాయని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ విమర్శించారు. పార్వతీపురం పట్టణంలో మంచినీటి సమస్యలపై ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు శుక్రవారానికి మూడో రోజుకు చేరడంతో దీక్ష శిబిరంలో ఉన్న మహిళలకు మద్దతు తెలిపారు. అనంతరం మంచినీటి సమస్యపై ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావమ్మ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తామని నమ్మించి, తీరా అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా కనీస మంచినీరు కూడా అందివ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని విమర్శించారు. పట్టణం మున్సిపాలిటీగా ఏర్పడక ముందు ఉన్న నీటి వనరులతో 50 ఏళ్లు పూర్తయినప్పటికీ నీటి వనరులను పెంచకపోవడం, బురద నీరు సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించకపోవడం అన్యాయం, ఇది పాలకుల నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు పన్నుల వసూలుతో పాటు మురుగునీటి కాలువలు, రోడ్లు, పట్టణ శివారు ప్రాంతాలు శుభ్రం చేయడంలో కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మంచినీటి సమస్య కేవలం మహిళల సమస్య మాత్రమే కాదని యావత్తు ప్రజానీకా సమస్యని ఈ కార్యక్రమాన్ని ముక్తకంఠంతో ప్రజలంతా భాగస్వాములై జయప్రదం చేయాలని అప్పుడే సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కుతుందని అన్నారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి మంచినీటి సమస్యపై ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ తాగునీరు సమస్య పరిష్కారంకై గత మూడు రోజులుగా చేపడుతున్న రిలే దీక్షలు ముగిసియాని, అలాగే ఈ దీక్షల్లో పాల్గొన్న తోటి మహిళలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అక్టోబర్ 1న మున్సిపల్ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ప్రజా ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నామని, దీన్ని పట్టణ మహిళలు, మేధావులు, అభ్యుదయవాదులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా, నాయకులు జి తులసి, ఎం గౌరీ, రవణమ్మ, సరస్వతి, బిందు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, నాయకులు బి.సూరిబాబు మహిళలు పాల్గొన్నారు.

గుదిబండగా డంపింగ్ యార్డు

- నగర పంచాయతీ కార్యాలయం ఎదుటే చెత్త పోగులు
- చోద్యం చూస్తున్న అధికారులు, పాలకులు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీకి ప్రజలకు డంపింగ్ యార్డు సమస్య గుదిబండంగా మారింది. ఎన్నో ఏళ్ల నుంచి ఈ సమస్య నగర పంచాయతీని పట్టి పీడిస్తుంది. 2013లో పాలకొండను నగర పంచాయతీగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ నేటి వరకూ డంపింగ్ యార్డును ఏర్పాటు కాలేదు. అట్టలి దగ్గర ఐదెకరాల స్థలాన్ని డంపింగ్ యార్డుకు కేటాయించినప్పటికీ, అప్పట్లో వివాదం ఎదురవ్వడంతో పట్టణంలో వీధులకు ఆనుకొని ఉన్న రజికనవాని చెరువు దగ్గర రెండెకరాలు తాత్కాలిక డంపింగ్ యార్డు కోసం స్థలాన్ని కేటాయించారు. స్థానికులు తమ వద్ద డంపింగ్ యార్డు వద్దని వ్యతిరేకించడంతో టిడి పారాపురం దగ్గర ఐదెకరాలు డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించారు. ఆ ప్రాంతం వారు కూడా ఇక్కడ చెత్త వేయొద్దంటూ ఆందోళనకు దిగడంతో సింగనవలస పంచాయతీ పరిధిలో మూడెకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. అయితే అక్కడ కూడా చెత్త వేయడాన్నికి సింగనవలస పంచాయతీ ప్రజలతో పాటు పక్కనే ఉన్న బూర్జ మండలానికి చెందిన హరిపురం, పల్లాపురం గ్రామస్తులు కూడా తీవ్రంగా వ్యతిరేకించారు.

దీంతో కొద్ది రోజులుగా పట్టణం నడిబొడ్డున గల నగర పంచాయతీ కార్యాలయం ఎదుటే చెత్తను డంప్ చేస్తున్నారు. గ్రంథాలయం కూడా అక్కడే ఉండడంతో అక్కడకు వెళ్లడానికి పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే నగర పంచాయతీ కార్యాలయానికి వివిధ పనుల రీత్యా వచ్చిన వారితో పాటు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది చెత్తకుప్ప నుంచి వచ్చే దుర్వాసనతో తీవ్ర అవస్థలుపడుతున్నారు. చేపల మార్కెట్, కూరగాయలు మార్కెట్ దగ్గరలోనే చెత్త వేస్తుండడంతో వ్యాపారస్తులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఈ చెత్త వేయడం వల్ల తమ వ్యాపారాలు కుదేలవుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు దీనిపై కనీస చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పాలక పక్షంతో పాటు, ప్రతిపక్షం కూడా దీన్ని పట్టించుకునే పరిస్థితి లేదు. 15, 16, 13 వార్డుల సమీపంలోనే చెత్త వేయడం వల్ల అక్కడున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలంటూ ఒకవైపున ప్రభుత్వం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తుంటే మరో వైపు పాలకొండ పట్టణ నడిబొడ్డన చెత్తకుప్ప ఉండడం ప్రజల ఆరోగ్యం పట్ల పాలకులు, ఉన్నతాధికారుల చిత్తశుద్ధి ఎలా ఉందో అర్థమవుతుందని స్థానికులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టి వెంటనే నగర పంచాయతీ కార్యాలయం వద్ద వేసిన చెత్తను తొలగించి ఆ ముప్పు నుంచి తమను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు..

నగర పంచాయతీ కార్యాలయం వద్ద డంప్ చేసిన చెత్తా చెదారం

చెత్త ఎత్తే వరకు పోరాటం

నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న చెత్త ఎత్తే వరకూ పోరాటాలు కొనసాగిస్తాం. దీనివల్ల నగర పంచాయతీ ప్రజలతో పాటు, వ్యాపారస్తులకు కూడా ఇబ్బందిగా ఉంది. ఇప్పటికే దీనిపై అనేక పోరా టాలు సాగించాం. మరింత పోరాటాలు ఉధృతం చేస్తాం. దీనిపై అధికారులు, పాలకులు దృష్టి పెట్టాలి.

దావాల రమణారావు,
సిఐటియు జిల్లా అధ్యక్షులు.

గ్రంథాలయానికి వెళ్లడం మానేశా

గ్రంథాలయం వద్ద చెత్త వేయడం వల్ల అక్కడికి వెళ్లడమే మానేశాను. రోజూ గ్రంథాలయానికి వెళ్లి పత్రికలు చదవడం అలవాటు. అయితే నెల రోజుల నుండి పత్రికలు చదవడం లేదు. అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకుని వెళ్లినా పట్టించుకోవడం లేదు

జి. దుర్గారావు,
విశ్రాంతి ఉపాధ్యాయుడు

వ్యాపారాలు దెబ్బతిన్నాయి

చేపల మార్కెటుకు ఆనుకొని చెత్త వేస్తున్నారు. దీని వల్ల మా వ్యాపారాలు దెబ్బ తింటున్నాయి. పక్కనే చెత్త వేయడంతో చేపలు ఎవరూ కొనుగోలు చేయడం లేదు. దీని వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

కె. లక్ష్మి,
చేపల వ్యాపారి.

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం

నగర పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న చెత్త తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు బత్తుల వాని చెరువు దగ్గర స్థలం గుర్తించాం. అక్కడున్న రైతులతో టిడిపి సీనియర్ నేత పల్లా కొండలరావు మాట్లాడగా, వారు కూడా సానుకూలంగా స్పందించారు.

సర్వేశ్వరరావు,
నగర పంచాయతీ కమిషనర్

ఎస్ఇగా బాధ్యతలు స్వీకరిస్తున్న చలపతిరావు

బాధ్యతలు స్వీకరించిన విద్యుత్ సర్కిల్ ఎస్ఇ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా విద్యుత్ సర్కిల్ ఎస్ఇ గా చలపతిరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏపిఈపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఇక్కడికి ఎస్ఇగా బాధ్యతలు చేపట్టారు. ఎస్ఇ చలపతిరావును ఇఇ గోపాలరావు నాయుడు, డిఇ రమణారావు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కింద స్థాయి అధికారులు, ఉద్యోగుల సహకారంతో కృషి చేస్తామని చెప్పారు.

నీటి నిల్వల్లేని కాలువలు ఆరోగ్య నిలయాలు

ప్రజాశక్తి -గరుగుబిల్లి

నీటి నిల్వలేని కాలువలు ఆరోగ్య నిలయాలని జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ అన్నారు. మండలంలో చినగుడబ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం సందర్శించారు. గ్రామంలో ఎక్కడ చూసినా నీటి నిల్వలే దర్శనమిస్తున్నాయన్నారు. తరచూ కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కడికక్కడ నీటి నిల్వలు ఎక్కువవుతున్నాయని, కాలువల్లో పూడికలు కూడా పేరుకుపోవడంతో నీరు నిలిచిపోతుందని అన్నారు. కావున దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వ్యాధులు పెరిగే అవకాశం ఉందని, అందుకే డ్రైడే విధిగా పాటించాలని సూచించారు. దీనికి ప్రజల భాగస్వామ్యం, సహకారం అవసరమన్నారు. కాలువల్లో చెత్తలు వేసే సంస్కృతి పోవాలని ఆకాంక్షించారు. సచివాలయ కార్యదర్శి శిరీష చిన గుడబలో కాలువలలో పూడికలు తీయించారు. స్థానిక ఎఎన్ఎం ఈశ్వరమ్మ, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ కుమార్ పాల్గొన్నారు.

జనసేన రాష్ట్ర కార్యదర్శి శివశంకర్ ఆధ్వర్యాన పార్టీలో చేరిన జర్జాపు సోదరులు

జనసేనలో చేరిన జర్జాపు సోదరులు

ప్రజాశక్తి - సాలూరు

జర్జాపు సోదరులు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. విశాఖపట్నంలోని జనసేన రాష్ట్ర కార్యదర్శి టి.శివశంకర్ సమక్షంలో ఆరుగురు కౌన్సిలర్లతో కలిసి వారు ఆపార్టీలో చేరారు. అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జర్జాపు సూరిబాబు, మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, లింగాల దుర్గ, గొల్లపల్లి వరప్రసాద్, జర్జాపు నీలిమ జనసేనలో చేరారు. గత కొంతకాలంగా జర్జాపు సోదరులు వైసిపికి దూరంగా వుంటున్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ పదవి కాలం విషయంలో గతంలో జరిగిన పెద్ద మనుషుల ఒప్పందాన్ని వైసిపి పెద్దలు అమలు చేయకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. దీంతో వైసిపిని వీడాలని నిర్ణయించుకున్నారు.

ఆలయాల్లో నేడు వైసిపి పూజలు

ప్రజాశక్తి - సాలూరు

తిరుపతి లడ్డు ప్రసాదం కల్తీ జరిగిందని ఆరోపిస్తూ టిడిపి కూటమి నాయకులు చేస్తున్న నిరసనలకు వ్యతిరేకంగా శనివారం వైసిపి నాయకులు పట్టణంలోని వెంకటేశ్వరుని ఆలయం పూజలు నిర్వహించనున్నారు. ఆలయాన్ని శుద్ధి చేసి వెంకటేశ్వరుని పవిత్రతను చాటిచెప్పనున్నారు. మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆధ్వర్యాన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని రాజన్నదొర ఒక ప్రకటనలో కోరారు.

మాదక ద్రవ్యాల వాడకంతో రుగ్మతలు

ప్రజాశక్తి - సీతానగరం

మాదక ద్రవ్యాల వాడకం వల్ల యువత అనేక రుగ్మతలు కొని తెచ్చుకుంటున్నారని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనార్థాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల దేశానికి వెన్నుముక అయిన యువత వీటికి అలవాటు పడి జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. మాదక ద్రవ్యాలు వాడడం వల్ల వచ్చే అనార్థాలు, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని ఖడ్గవలస జంక్షన్‌లో వాహనదారులకు అవగాహన కార్యక్రమం ఎస్ఐ రమేష్ నాయుడు నిర్వహించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్, నివారణా చర్యలు, మత్తుపదార్థాల నివారణ, రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు, దొంగతనాలు అరికట్టడం వంటి అంశాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు బాబ్జీరావు , రాము, కానిస్టేబుల్ శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం వికసిత్ భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందాలంటే ఏఏ రంగాల్లో దృష్టి సారించి వికసిత్ ముందుకెళ్లాలనే అంశం పైన ఎంఇఒ డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో మండల స్థాయి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆరు నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈనెల 28న నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న వ్యాసరచన పోటీలకు మండల స్థాయిలో విజేతలైన విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందజేశారు.

ఐటిఐ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి ఐటిఐలో ఎలక్ట్రీషియన్ చదివిన సీనియర్ విద్యార్థులకు ఆన్‌లైన్ జాబ్ నిమిత్తం హైదరాబాదులో ఉన్న ఎస్‌జిఎంట్ కంపెనీలో మూడు నెలల శిక్షణకు పంపించినట్లు ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు మూడు నెలల శిక్షణలో కొత్త టెక్నాలజీతో పనిచేస్తారని, విద్యార్థులకు ఉచితంగా భోజన, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థుల రక్త నమూనాల సేకరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వైద్య సిబ్బంది విద్యార్థులకు రక్త నమూనాలను సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రక్త నమూనాలతో పాటు ఎత్తు, బరువు, వివరాలను రికార్డుల్లో పొందుపర్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాస్కర్, అధ్యాపకులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి నుంచి రక్త నమూనా సేకరిస్తున్న వైద్య సిబ్బంది

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. భవిష్యత్తును కాపాడుకుందాం

- నేటి నుంచి భగత్ సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్
- అలరించనున్న కళారూపాలు
- గురజాడ కళాభారతి వేదికగా 3 రోజుల పాటు కార్యక్రమాలు
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాము, వెంకటేష్

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. భవిష్యత్తును కాపాడుకుందాం అనే నినాదంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శనివారం నుంచి మూడు రోజులు పాటు భగత్‌సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్‌ను నగరంలోని గురజాడ కళాభారతిలో నిర్వహించనున్నారు. నేటి సమాజంలో రోజురోజుకూ మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో పెడతోవ పడుతున్న యువతకు మత్తుతోనే కాదు ఆనందం, ఆటలు పాటలు, సాంస్కృతిక కళా రూపాలు ద్వారా ఉందని చూపించే ప్రయత్నంలో భాగంగా ఎస్ఎఫ్ఐ భగత్ సింగ్,గాంధీ జయంతి సందర్భంగా ఫెస్ట్ పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఈనెల 28,29,30 తేదీల్లో మూడు రోజులు పాటు నగర ప్రజలను, యువతను ఆకట్టుకునే విధంగా కార్యక్రమాలు నిర్వహించనుంది.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత యువత మన దేశంలో ఉంది. కానీ నేటి ఆ యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై మహిళలపై అత్యాచారాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ పెడతోవ పడుతోంది. అగ్నికి ఆజ్యం తోడైనట్లు పెరుగుతున్న నిరుద్యోగం యువతను పక్కదారి పట్టిస్తోంది. గొప్పగొప్ప ఉన్నత చదువులు చదువుకున్న వారు, తెలివైన విద్యార్థులు చదువు అనంతరం డబ్బులు కోసం మత్తు పదార్థాల రవాణాకు పాల్పడుతున్నారు. ఆ క్రమంలోనే వాటిని సేవించడానికి అలవాటు పడుతూ తమ జీవితాలను, ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థుల చేతుల్లో కూడా చాక్లెట్ వచ్చి చేరినంత సులువుగా గంజాయి వచ్చి చేరుతుంది. వీటన్నింటికీ గల కారణం పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య ఉన్న సంబంధాలు అంతకంతకూ తగ్గుతుండడమే. పేదరికం పెరిగిపోవడంతో చాలా మంది తల్లిదండ్రులు వలసలు పోతున్నారు. మధ్యతరగతి, ధనిక కుటుంబాల్లో భార్య, భర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులు కావడంతో పిల్లల పర్యవేక్షణకు, వారితో మాట్లాడటానికి తగినంత సమయం కేటాయించడంలేదు. ఒకప్పుడు విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉండేవి. అవి వారికి మానసిక ఉల్లాసాన్ని, నైతిక విలువలను అందించేవి. రానురానూ అవి విద్యార్థులకు దూరమౌతున్నాయి. దీంతో విద్యార్థులు చదువు అనంతరం మిగిలిన సమయాన్ని మొబైల్స్‌లోను, మత్తు పదార్థాలకు ప్రేరేపితమై వాటిలోనే ఆనందాన్ని వెతుక్కుంటున్నారు. అందుకనే విజ్ఞానం-వినోదంలోనే డ్రగ్స్‌కు మించిన ఆనందం ఉందంటూ అటు తల్లిదండ్రులను, ఇటు విద్యార్థులను చైతన్యం చేసే కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ శ్రీకారం చుట్టింది. డ్రగ్స్ బారిన పడితే జీవితాలు ఏ విధంగా నాశనం అవుతాయో తెలియజేస్తూ జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఫ్లాష్ మాబ్స్ (వీధి నాటకాలు) గత 15 రోజులుగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగింపుగా సెప్టెంబర్ 28, 28, 30 మూడు రోజులు పాటు భగత్ సింగ్, గాంధీజీ జయంతి వారోత్సవాల్లో భాగంగా భగత్ సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్‌ను నిర్వహిస్తుంది. ఈ మూడు రోజులు పాటు కళాశాల స్థాయి విద్యార్థులు వారిలో ఉన్న టాలెంట్స్ పాటలు, డాన్స్, నాటికలు, మ్యాజిక్ షో, మ్యూజికల్ ఇనుస్ట్రుమెంట్స్ ప్లే చేయడం వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని ఈ కార్యక్రమాల్లో పాల్గొవచ్చు. ఇప్పటికే అనేక మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

ఈ కార్యక్రమాలను జయప్రదం చేసేందుకు ఎస్ఎఫ్ఐ నాయకులు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటలు వరకు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ కోరారు.

మొదటి రోజు

నగరంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు వేలాది మంది విద్యార్థులతో ప్రారంభోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం డ్రగ్స్ వినియోగం వల్ల నష్టాలు, అమ్మాయిలపై అత్యాచారాలకు కారణాలకు సంబంధించి నాటికలు వేస్తారు. అమ్మాయిల ఆత్మరక్షణకు సంబంధించి కరాటే, కర్రసాము వంటి కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.

రెండోరోజు

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సైంటిఫిక్ టెంపర్‌ను అందించడానికి 50 రకాల ప్రయోగాలతో విద్యార్థులందరినీ అబ్బురపరుస్తూ ఔరా అనేలా సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థులతోనే చేయించనున్నారు. నాటిక, మరుగుతున్న నూనెలో నుంచి గారెలు తీయడం వంటి కార్యక్రమాలు చేయనున్నారు.

మూడో రోజు

ఉత్తరాంధ్ర సాంప్రదాయ కళారూపాలైన పులివేషాలు, తప్పిటగుళ్ళు, ధింసా వంటి కార్యక్రమాలను ప్రదర్శిస్తారు. మేకులపై నడవడం, నిప్పులపై నడవడం, ఉత్తరాంధ్ర సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు, పులివేషాలు, తప్పెట గుళ్ళు, డ్యాన్స్, పాటలు, ధింసా నృత్యం, క్లాసిక్, వెస్ట్రన్ సినిమా పాటలు, జానపదాలు, సోలో, అభ్యుదయ గీతాలు, ఫోక్ పాటలు, నాటికలు, మ్యాజిక్ షో, ఏకపాత్రాబినయం, లఘు నాటికలు, సంగీతం వంటి పోటీలు, కార్యక్రమాలు ఉంటాయి.

పాఠశాల నిర్మించాలని డిఇఒకు వినతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ధారపాడు పంచాయతీ రామానగరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెంటనే నిర్మించాలని కోరుతూ గిరిజన సంఘం నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మకు శుక్రవారం వినతి అందజేశారు. పాఠశాల పూర్తిగా మరమ్మతులకు గురైందని తెలిపారు, దీంతో విద్యార్థుల చదువుకు ఇబ్బందిగా ఉందన్నారు. కావున వెంటనే పాఠశాలను నిర్మించాలని కోరారు. వినతిని వారితో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతి రావు, జె.శ్రీరాములు, ఎ.సురేష్, బి.పరుసరాం, ఎస్.వెంకన్న, సర్పంచ్ జె. సుందరమ్మ తదితరులు ఉన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులకు చట్టాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని ఎల్విన్‌పేట సిఐ హరి అన్నారు. శుక్రవారం మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో, సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు గురించి వివరించారు. వాటి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై నీలకంఠరావు, ట్రైనీ ఎస్ఐ బాషా, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ అభిమానుల సందడి

ప్రజాశక్తి- వీరఘట్టం

మండల కేంద్రంలోని బిఎంఆర్ థియేటర్ వద్ద శుక్రవారం జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవర సినిమా విడుదల కావడంతో అభిమానులు పెద్ద ఎత్తున సందడి చేశారు. విజయదశమికి ముందస్తుగా ఈ సినిమా విడుదల కావడంతో అభిమానులు జూనియర్ ఎన్టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మండ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల్లో బోధన వారిలో పఠనాసక్తి గమనించారు. అంగన్వాడీ కేంద్రం పరిసరాల పరిశుభ్రత, ఆహార పదార్థాలు తయారీ తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను స్వయంగా చిన్నారులకు వడ్డించడమే కాకుండా ఆహార పదార్థాలు రుచిని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల ఆరోగ్యానికి ప్రథమ కేంద్రాలుగా నిలవాలని, చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారమందించడమే కాకుండా వాటిని తీసుకొనేలా చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. చిన్నారుల చదువు పట్ల శ్రద్ధ చూపేలా అంగన్వాడీ కేంద్రాల్లోనే సరైన బీజాలు పడాలని ఆదేశించారు. చిన్నారులకు ఆటపాట విధానంలో విద్యాబోధన జరపాలని, అక్షర జ్ఞానం పొందేందుకు ప్రధాన కేంద్రాలుగా నిలిచిపోవాలని అన్నారు. తినే ముందు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం నేర్పాలన్నారు. కలెక్టర్ వెంట ఐటిడిఎ పీడీ రాణి, సిడిపిఒ రంగలక్ష్మి ఉన్నారు.

విడివికెల సందర్శన

అనంతరం గ్రామంలో గల వన్ ధన్ వికాస్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విడివికెలు తయారు చేస్తున్న ఉత్పత్తులను పరిశీలించారు. విడివికె సభ్యులతో ముఖాముఖి మాట్లాడి వారు తయారు చేస్తున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ నాణ్యమైన ఉత్పత్తులకు నిలయంగా విడివికెలు మారాలని అన్నారు. నాణ్యమైన వస్తువులకు విక్రయాలు ఎక్కువగా జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి యశ్వంత్ కుమార్ రెడ్డి, ఎపిడి సన్యాసిరావు, మేనేజర్ కృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవాల నిర్వహణకు చర్యలు

ఉత్సవ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - పాలకొండ

అక్టోబర్ 3 నుంచి 12 వరకు కోట దుర్గమ్మ వారి దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిపేందుకు కూటమి నేతలు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే జయకృష్ణ సిఫార్సుతో ఉత్సవ కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. 22 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా టిడిపి సీనియర్ నేత పల్లా కొండలరావు ఉండగా, ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా గార దుర్గారావు, సభ్యులుగా రుద్రకోటేశ్వరరావు, దూబ వెంకటరమణ, అంపోలు చిన్న శ్రీనుతో పాటు మరి కొంతమంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పల్లా కొండలరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్ మాట్లాడి ఉత్సవాలు ప్రభుత్వ పండుగ్గా గుర్తించి జరపాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందింస్తూ దేవదాయ శాఖ కమిషనర్‌తో ఈ విషయాన్ని మాట్లాడానని చెప్పారు. అదే విధంగా ఆలయంలో దసరా ఉత్సవాల ఏర్పాట్లుపై అధికారులు దగ్గరుండి నేతలతో సమీక్షించారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

కోట దుర్గమ్మ దసరా నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఎస్పీ మాధవ్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. నవరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆలయం దగ్గర నిఘా పెట్టాలన్నారు. ఈయనతో పాటు డీఎస్పీ రాంబాబు, సిఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగ మూర్తి, ఆలయ ఇఒ సూర్యనారాయణ, ప్రధాన అర్చకులు దారలపూడి లక్ష్మీప్రసాద్ శర్మ, పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్ కూమార్, రుద్రకోటేశ్వరరావు, అంపోలు చిన్న శ్రీను ఉన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని డికె పట్నం సచివాలయ ఆవరణంలో శుక్రవారం లయన్స్ క్లబ్ నేతృత్వంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ వైద్యశిబిరంలో పార్వతీపురం, శ్రీకాకుళం రాజోలు జెమ్స్ ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి లయన్స్ అధ్యక్షులు బిఎన్‌బి రావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న నిరుపేద గిరిజన ప్రజలకు ఉత్తమమైన వైద్య సేవలు ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ఈ మెగా మెడికల్ క్యాంపును నిర్వహించామన్నారు. ఈరోజు 650 మంది రోగులకు ఉచితంగా వైద్యమందించినట్టు తెలిపారు. గుండె జబ్బులు, జనరల్ మెడిసిన్, చర్మ, ఎముకల, ఆయుర్వేదం, కంటి వైద్యులు, స్త్రీల సమస్యలు, ఊపిరితిత్తుల, గ్యాస్ట్రో తదితర ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొని ఉచితంగా వైద్య సేవలందించారు. మందులు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. గుండె జబ్బులకు సంబంధించి 2డి ఎకో స్కేన్, ఇసిజి, షుగర్, మలేరియా వంటి అనేక పరీక్షలు ఉచితంగా చేసినట్లు తెలిపారు. ఈ మెగా మెడికల్ క్యాంపులో ముఖ్య అతిథులుగా లయన్ సభ్యులు డాక్టర్ డి.రామ్మోహన్ రావు, డాక్టర్ యాళ్ల వివేక్, కమిటీ ఛైర్మన్ డాక్టర్ వాసుదేవ రావు, కోఆర్డినేటర్ డాక్టర్ నల్ల దుర్గాప్రసాద్, డాక్టర్ శ్రీరేఖ, డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి వాగ్దేవి, డెంటిస్ట్ పి వసంతకుమార్ పాల్గొని వైద్య సేవలు అందించారు. రాగోలు జెమ్స్ హాస్పటల్ నుంచి వైద్యులు వచ్చి, పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంచారు. అనంతరం డికె పట్నం గ్రామ సచివాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయిన్స్ క్లబ్ సెక్రటరీ పసుమర్తి శివ ప్రసాద్, ట్రెజరర్ బివిఎస్ నాయుడు, లయన్స్, రెడ్ క్రాస్ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థ జెకెఎస్ సభ్యులు, డికె పట్నంలోని పెద్దలు, యువత పాల్గొని సేవలు అందించారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు రామ్మోహనరావు, వివేక్

విధుల్లో అలసత్వం వద్దు : ఇన్‌ఛార్జి డిపిఒ

ప్రజాశక్తి - భామిని

సిబ్బంది తమ విధుల్లో అలసత్వంగా ఉండకూడదని, అలా ఉంటే అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జి డిపిఒ కె.రామచంద్రరావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో కలిపి 44 వాటర్ ట్యాంక్‌లు రిజిస్టర్ చేశారు, కానీ వాటిలో 21 మాత్రమే శుభ్రం చేశారని, మిగిలిన వాటిని శుభ్రం చేయకుండా ప్రజలకు తాగు నీరు అందిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ తాగునీరు క్లోరినేషన్ చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో ఎక్కడా పారిశుధ్యం కనిపించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర -2047 విజన్ అంటుంటే క్షేత్ర స్థాయిలో మీరు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్‌యుపిడబ్ల్యుల వర్కింగ్ కండిషన్‌లోకి తేవాలని చెప్పి వంద రోజులైనా, అవి ఎలా ఉన్నాయో చెప్పలేని పరిస్థితి అని మండి పడ్డారు. సెప్టెంబర్ 30నాటికి ప్రతి పంచాయతీలోని ఎస్‌యుపిడబ్ల్యు తిరిగి పునఃప్రారంభించాలని సూచించారు. పంచాయతీ లాగిన్, పాస్ వర్డ్‌లు ఒక ఎంసిఒ వద్ద ఉంచితే నిధులు దుర్వినియోగమయ్యావా అని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శులుగా మీ లాగిన్ మీరు మెయింటైన్ చేసి బిల్లులు, ఓచర్లు అప్లోడ్ చేయలేరా అని ప్రశ్నించారు. ఈనెలాఖరుకు ప్రతి పంచాయతీ కార్యదర్శి లాగిన్ పంచాయతీ కార్యదర్శి చేయాలని, టెక్నికల్ సమస్య ఉన్నప్పుడే మాత్రమే దాన్ని ఎంసిఒ సరి చేస్తారని తెలిపారు. చాలా అంశాల్లో మండలంలోని పంచాయతీ కార్యదర్శుల పని తీరు బాగోలేదని, ఈ విధానం మార్చు కోవాలని, విధుల్లో అలసత్వం వద్దు అని అన్నారు. పంచాయతీ కార్యదర్శుల అలసత్వం కారణం ఇఒపిఆర్‌డి తీరేనన్నారు. కార్యక్రమం లో అన్ని పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తక్కువ పెట్టుబడితో ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ఉత్తర కోస్తా రీజనల్ మోడల్ మండల యాంకర్ పర్సన్ రమాప్రభ అన్నారు. స్థానిక మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ సంఘ అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. సంఘ సభ్యులంతా తమకున్న పూర్తి విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేయాలని, ప్రతి గ్రామంలో ఎన్‌పిఎం షాప్ పెట్టి రైతులకు కషాయలు- ద్రావణాలు అందుబాటులో ఉండేలా సబ్ కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. పాఠశాల ఖాళీ ప్రదేశాల్లో పంటలు పండించాలని, సంఘ సభ్యులు సమావేశంలో పాల్గొనడం, పొదుపులు చేయడంలోను, తీసుకున్న రుణాలు చెల్లించడంలో సంఘసభ్యులు పాత్ర అమోఘమని హితవు పలికారు. కార్యక్రమంలో ఎపిఎం ఆదయ్య ఉన్నారు.

నేడు మన ఇల్లు -మన గౌరవం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఈ నెల 28న మన ఇల్లు -మన గౌరవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల గృహ నిర్మాణ శాఖ ఎఇ వావిలపల్లి వినోద్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి గృహ లబ్ధిదారులు, అధికారులు, ప్రజా ప్రతినిధులుపాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విధిగా పౌష్టికాహారం తీసుకోవాలి

గరుగుబిల్లి: పిల్లలు ఆరోగ్య ఉండాలంటే తల్లి విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, అలాగే గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందజేయడం జరుగుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి అన్నారు. సంపూర్ణ పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రావుపల్లిలో శుక్రవారం పోషకాహార ప్రదర్శనతో పాటు గ్రామంలో అంగన్వాడీ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి మాట్లాడుతూ పౌష్టికాహార నిర్వహణపై ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహార లోపానికి గురికాకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎం.సావిత్రి, చింతల అరుణ, పల్ల కృష్ణవేణి, రౌతు పద్మ, మూడడ్ల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం ఎస్ఐ, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒడిశా నుంచి ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్‌పై రావడం చూసి వారిని ఆపి సోదా చేశారు. వారి వద్ద కేజీ గంజాయి దొరికింది. పట్టుబడిన వ్యక్తి శ్రీకాకుళానికి చెందిన ఆవాల అనిల్. ఈయన స్నేహితుడు భరత్‌తో కలిసి సుంకి వద్ద గంజాయిని కొనుగోలు చేసినట్లు, దాన్ని సొంత వినియోగానికి, కొంత అమ్మడం కోసం తీసుకున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకట సురేష్ తెలిపారు.

నేత్ర చికిత్సలకు వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గంలో ఇటీవల కంటి వైద్య శిబిరాల్లో గుర్తించిన నేత్ర చికిత్స అవసరమైన వృద్ధులను పుష్పగిరి కంటి ఆసుపత్రికి శుక్రవారం తరలించినట్లు జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఇటీవల సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాల్లో నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లోనూ, సిఎం నేత్ర కేంద్రాల్లో నిర్వహిస్తున్న నేత్ర పరీక్షల్లో కేటరాక్ట్, టేరిజియం లోపం ఉన్న వారిని గుర్తించి ఉచితంగా శస్త్ర చికిత్సల కోసం తరలించామని తెలిపారు. అలాగే పాలకొండ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఫాలో అప్ చేస్తామన్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జకు చెందిన కండి వసంత గత నెల 26న ఆమె ఒక పిన్ని ఇంటికి వెళ్తానని చెప్పి ఇంట్లో నుండి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కనబడలేదని యువతి తల్లి కండి పార్వతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేష్ తెలిపారు. వసంత ఆచూకీ ఎవరికైనా తెలిసినా, కనబడిన 09121109457 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ మంచి ప్రతిభ చూపించాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అండర్-14 బాల, బాలికల జిల్లాస్థాయి హ్యాండ్ బాల్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని, అలాగే చదువుతో పాటు ఆటలు కూడా ఒక భాగమేనని అన్నారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఉద్యోగాలను సంపాదించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే ఆటల్లో విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డిక పద్మావతి, మండంగి భూషణ, ఎంపిడిఒ సాల్మన్‌రాజు, ఎంఇఒ చంద్రశేఖర్, హెచ్ఎం నాగరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బుడ్డిపేటలో పొలంబడి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బుడ్డిపేటలో పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ వరి పంటలో అవలంబించే దీర్ఘ కాలిక, స్వల్పకాలిక పద్ధతుల గురించి చర్చించారు. విత్తనశుద్ధి, విత్తే సమయం, మొనలు తుంచటం, నారుమడి యాజమాన్యం, చేతితో కలుపు తీయటం వంటి స్వల్ప కాలిక పద్ధతులను వివరించారు. అలాగే దీర్ఘకాలిక పద్ధతులైన విత్తన రకాల ఎంపిక, సస్య భ్రమణం, పచ్చిరొట్ట మొక్కలు పెంచి కలియ దున్నడం, ఎరువుల యాజమాన్యం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విఎఎ పి.లక్ష్మణ్, బి.సుధీర్, పొలంబడి రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.